## క్లుప్తంగా

### స్వధార్ హోమ్‌కు విరాళం

తెనాలిఅర్బన్: ప్రపంచ ప్రార్థన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుర్రిపాలెం రోడ్డులోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో అంగలకుదురులోని స్వధార్ హోంకు రూ.15వేల విరాళాన్ని శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జేమ్స్ మోర్లే మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే మదర్ థెరిస్సా సందేశాన్ని స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ జి.విజయకుమారి, సీనియర్ ఉపాధ్యాయులు శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

### నేడు మెగా వైద్య శిబిరం

తెనాలిటౌన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శారదా సర్వీసు సొసైటీ, కుమార్ పంప్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకే సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, కుటుంబ సభ్యుల ఫోన్‌నెంబర్ తీసుకురావాలని కోరారు.

### గ్యాస్ ధర పెంపుపై నిరసన

తెనాలిటౌన్: దేశంలో పెంచిన వంటగ్యాస్, డీజిల్, పెట్రోలు, నిత్యావసర సరుకుల ధరలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణ దేవిచౌక్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు దారా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విభజన హామీలను అమలు చేయాలని కోరారు. పెంచిన గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీసెల్ నాయకులు దాసరి ప్రభు, మత్తె రవి, పాముల పవన్, మెస్సయ్య పాల్గొన్నారు.

### పాత కక్షల నేపథ్యంలో దాడి

తెనాలిరూరల్: పాత కక్షల నేపథ్యంలో యువకుడిపై దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ప్రశాంత్‌కిరణ్ శుక్రవారం రాత్రి రజకచెరువు సమీపంలోని కర్రీ పాయింట్ వద్దకు వెళ్లాడు. ఐతానగర్‌కు చెందిన బుడ్డా, దిడ్ల నాని మరి కొందరు ప్రశాంత్ కిరణ్‌ను తమ వెంట తీసుకెళ్లి దాడి చేసి గాయపర్చారు. బాధితుడి ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### బీజేపీ విజయోత్సవాలు

తెనాలిటౌన్: ఇటీవల ఈశాన్య రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంపై రూరల్ మండలం నందివెలుగులోని మేడ సెంటర్‌లో బీజేపీ నాయకులు శనివారం విజయోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో టపాసులు కాల్చి ప్రజలకు మిఠాయిలను పంచిపెట్టారు. గ్రామ సెంటర్‌లో బీజేపీ జెండాను ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు తోటకూర కోటేశ్వరరావు ఆవిష్కరించారు. సీనియర్ నాయకులు శాఖమూరి శంకరరావు, సిఖా రవీంద్ర, శీలం తిరుపతమ్మ పాల్గొన్నారు.

### కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: మారీసుపేటలోని ఎన్‌సీఆర్ స్కూల్ నుంచి రేపల్లె గేటు వరకు ఉన్న అక్రమణలను మున్సిపల్ అధికారులు రెండు రోజుల నుంచి తొలగిస్తున్నారు. శనివారం అప్పల స్వామి గుడి నుంచి రేపల్లె గేటు వరకు జెసీబీతో మున్సిపల్ స్థలంలో ఉన్న మెట్లు, ఫ్లోరింగ్‌ను తొలగించారు. తొలగింపు పూర్తి అయిన అనంతరం అక్కడ మురుగు కాల్వను నిర్మించనున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. రెండు రోజుల్లో పనులను కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు.

### ఆరోగ్య ఉపకేంద్రం తనిఖీ



తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని శనివారం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అన్నపూర్ణ సందర్శించారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉపకేంద్రంలోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కొలకలూరు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, డాక్టర్ దిలీప్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### రేపల్లె కెనాల్‌లో జారిపడి వ్యక్తి మృతి

కొల్లిపర: రేపల్లె కెనాల్‌లో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. దీనిపై పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి మండల పరిధిలోని అన్నవరం గౌడపాలెం గ్రామానికి చెందిన తోట గోవింద్(48) వ్యక్తి గ్రామంలో అనారోగ్యంతో వృద్ధురాలు మృతి చెందటంతో ఆమె అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వస్తుండగా కాల్వ ఒడ్డున కాళ్లు, చేతులు కడుక్కుంటూ ఉండగా ప్రమాదవశాత్తు జారి కాల్వలో పడి మృతి చెందినట్లు దీనిపై కుటుంబసభ్యులు శనివారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి తెలిపారు. మృతుడికి భార్య ఇదివరకే మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమారులు.

# ఆసరాగా ఆర్థిక సంఘం నిధులు

- తెనాలిలో వేగవంతంగా అభివృద్ధి పనులు
- ఈనెల చివరిలోపు పూర్తి చేసేందుకు చర్యలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పలు అభివృద్ధి పనులకు 14వ ఆర్థిక సంఘ నిధులు ఆసరాగా నిలుసున్నాయి. ఆర్థిక సంఘం 2015–16 నుంచి 2019–20 నాటికి రూ.36.66కోట్ల నిధులను తెనాలి పురపాలక సంఘానికి విడుదల చేసింది. అయితే కేంద్రప్రభుత్వం నిధులను సకాలంలో విడుదల చేయకపోవటం వల్ల ఈఏడాది మార్చిలోపు వాటిని ఉపయోగించుకోవాలనే వెసులుబాటు కల్పించింది. దీంతో మున్సిపల్ అధికారులు పనులు వేగవంతం చేశారు.

**తెనాలి పురపాలక సంఘానికి రూ.36.66కోట్లు..**

2015 ఏప్రిల్ ఒకటిన 14వ ఆర్థిక సంఘం ప్రారంభమైంది. దానికింద తెనాలి పురపాలక సంఘానికి అయిదేళ్లలో రూ.36.66కోట్ల నిధులను విడుదల చేశారు. అయితే నిధుల విడుదలలో జాప్యం జరిగింది. దీంతో ఉన్నతాధికారులు వీటి వినియోగానికి అదనపు సమయాన్ని ఇస్తు జీఓలు ఇచ్చారు. వాస్తవంగా వీటి పనులు 2020 ఏప్రిల్‌లో పూర్తి కావాల్సి ఉంది. కానీ నిధుల విడుదలలో జాప్యం వల్ల 2023 మార్చి చివరి నాటికి వీటి పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు.

**రూ.31.16 కోట్లు చెల్లింపు..**

14వ ఆర్థిక సంఘ నిధులను ఇప్పటి వరకు నూతన రోడ్లు, కాల్వలు, ఎస్‌టీపీ ప్లాంట్, అయితానగర్‌లోని హిందూ స్మశాన వాటికలో ఎల్‌పీజీ క్రిమోటోరియమ్ ఏర్పాటు, విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి డివైడర్‌లలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, రక్షిత మంచినీటి పథకానికి సంబంధించిన పైప్‌లైన్ ఏర్పాటు వంటి పనులకు ఉపయోగించే ప్రతిపాదనలు చేశారు. వాటిలో ఇప్పటి వరకు దాదాపు రూ.31.16 కోట్ల నిధులకు పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్‌లకు అధికారులు చెల్లించారు. మిగిలిన రూ.5.50 కోట్లకు సంబంధించిన పనులలో కొన్ని ఇప్పటికే జరుగుతుండగా మరికొన్ని ఇంకా ప్రారంభం కాలేదు.



13వ వార్డులో నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్డు

**వేగవంతంగా పనులు..**

14వ ఆర్థిక సంఘ నిధుల వినియోగానికి సమయం తక్కువ ఉండటంతో మున్సిపల్ అధికారులు పనులు వేగవంతం చేశారు. పెండింగ్‌లో ఉన్న రూ.5.50 కోట్లకు సంబంధించిన 44 పనులలో ఇప్పటి వరకు 22 పనులు పూర్తి చేశారు. వాటి బిల్లులు ఆమోదించాల్సి ఉంది. అలాగే 15 పనులు జరుగుతుండగా, 7 పనులు నేటికీ ప్రారంభం కాలేదు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి మిగిలిన ఏడు పనులు ప్రారంభించి ఈనెల చివరిలోపు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటే నిధులు వెనక్కి వెళ్లే అవకాశం ఉండదు. ఆదిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఈనెల చివరిలోపు పూర్తి చేయిస్తాం**



14వ ఆర్థిక సంఘం నిధులను మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. ఇప్పటికే కాంట్రాక్టర్‌లు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పనులు ప్రారంభించటంతో పాటు వేగవంతం చేయాలని ఆదేశించాం. అలాగే పూర్తి అయిన పనుల బిల్లులను కూడా వెంటనే పెట్టి ఆమోదించాలని సూచించారు. మార్చి నెలాఖరులోపు వాటిని పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

–ఎం.జశ్వంతరావు,
కమిషనర్, తెనాలి పురపాలక సంఘం

## రెయిన్‌బో ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

- ఆటపాటలు, క్యాట్‌వాక్‌లతో సందడి
- వివిధ రంగాల ప్రముఖులకు సత్కారం

తెనాలి: పట్టణానికి చెందిన స్వచ్ఛంద సంస్థ రెయిన్‌బో ట్రస్ట్, గుంటూరులోని రోటరీ క్లబ్ ఆదర్శ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం స్థానిక హోటల్ గౌతమ్ గ్రాండ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం 11 గంటల్నుంచి సాయంత్రం 5 గంటల వరకు వందలాది మంది మహిళలు ఆటపాటలతో, క్యాట్‌వాక్‌తో ఉత్సాహంగా గడిపారు. ఆటలపోటీలు, సృజనను పెంచే కార్యక్రమాలను జరిపారు. స్వయం శక్తితో వివిధ రంగాల్లో ఉన్నతస్థాయికి చేరుకున్న తొమ్మిది మంది విశిష్ట మహిళలను ఈ వేదికపై సత్కరించారు. ప్రొఫెసర్ డాక్టర్ సత్యశ్రీ నన్నపనేని, ప్రిన్సిపాల్ డాక్టర్ అనూరాధ, అడిషనల్ ఎస్పీ స్నేహిత, నృత్యగురువు బి.రంగనాయకి, పవర్ లిఫ్టర్ షేక్ షబీన, సన్నాయి విద్వాంసురాలు హైమావతి, మృదంగ కళాకారిణి కాకరపర్తి జగన్మోహిని, శాస్త్రీయ సంగీత కళాకారిణి కొండపి వసుంధర ఈ సత్కారాన్ని అందుకున్నారు. మహిళా దినోత్సవంలో వచ్చిన నగదుతో ఈనెల 12వ తేదీన శబరి వృద్ధాలయంలో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్టు రెయిన్‌బో ట్రస్ట్ వ్యవస్థాపకురాలు డాక్టర్ జీవనలత వెల్లడించారు. తమకు సహకరించిన కొల్లా ధర్మకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో కళ్యాణి, వరలక్ష్మి, గాయత్రి, జ్యోతి, వసంత, అంజూమ్, సుధామాధవి, జూటూరి సృజన, టి.జ్యోతి, వై.లక్ష్మీ, రోటరీ క్లబ్ ఆఫ్ ఆదర్శ్ అధ్యక్షురాలు పి.వాణి, జి.జయశ్రీ, ఎం.సునీత, వినీత పాల్గొన్నారు.



నృత్యగురువు బి.రంగనాయకికి సత్కారం



మహిళల క్యాట్‌వాక్ ప్రదర్శన

## గుప్తా ఫార్మశీలో ఫెషర్స్ డే వేడుకలు

తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని ఎస్ఆర్‌కే అండ్ కేఎస్ఆర్ గుప్తా కాలేజ్ ఆఫ్ ఫార్మశీలో శనివారం ఫెషర్స్ డే వేడుకలను నిర్వహించారు. బి.ఫార్మశీ సీనియర్ విద్యార్థులు 2023–24 విద్యాసంవత్సరంలో చేరిన ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఆహ్వానం పలుకుతూ ఫెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొట్టి శ్రీరాములు విద్యాసంస్థల కోశాధికారి, చార్టర్డ్ అకౌంటెంట్ రావూరి సుబ్బారావు మాట్లాడుతూ లాభాపేక్ష లేకుండా తక్కువ ఫీజుతో డిగ్రీ, పీజీ, వృత్తి విద్యాకోర్సులను నడపడం కళాశాల యాజమాన్యానికే దక్కుతుందన్నారు. తొలుతగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించారు. కబడ్డీ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రిన్సిపాల్ అనిల్ కుమార్, సుబ్బారావులు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల మేనేజర్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎం.దశరథరామిరెడ్డి, ఎం.దుర్గారావు, నరేష్, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ అనిల్‌కుమార్

## ఆయుర్వేదం భారతీయుల జీవన నాదం

పాత గుంటూరు: మన సంస్కృతి సాంప్రదాయాల్లో భాగమైన ప్రాచీన ఆయుర్వేదం భారతీయుల జీవన విధానంలో భాగమైందని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. శనివారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ బృందావనం రాధాకృష్ణ మూర్తి రచించిన ఆయుర్వేద చికిత్సా పుస్తకాన్ని దేవదాయ శాఖ సహాయ కమిషనర్ మహేశ్వర రెడ్డి, యుగంధర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ అల్లోపతి వైద్యం అభివృద్ధి చెందినప్పటికి ఆయుర్వేదానికి ప్రత్యేక స్థానముందని చెప్పారు. అనంతరం డాక్టర్ రాధా కృష్ణమూర్తి, సామ్రాజ్యం దంపతుల్ని ఘనంగా సత్కరించారు. సమావేశానికి హిందూ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ దీక్షితులు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో డాక్టర్ దీవి హరిప్రసాద్, జంధ్యాల వెంకట రామలింగేశ్వర శాస్త్రి, సిరిపురపు శ్రీధర్, రొంపిచర్ల శేషాచార్యులు, డాక్టర్ బృందావనం రాజేష్, మేడూరి శ్రీనివాసమూర్తి, డాక్టర్ నారాయణం వేణుగోపాల్ పాల్గొన్నారు.



## మృతదేహంతో ధర్నా

తెనాలి రూరల్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతుల కుటుంబసభ్యులు, బంధువులు ధర్నాకు దిగారు. మృతదేహంతో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. వివరాల్లోకి వెళితే.. గత నెల 27వ తేదీన బాపట్ల జిల్లా చుండూరు మండలం దుండిపాలెం గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు వెళుతున్న వాహనం చేబ్రోలు మండలం గరువుపాలెం, వడ్లమూడి మధ్య ప్రమాదానికి గురై ఇద్దరు మరణించగా పలువురు కూలీలు గాయపడిన సంగతి తెలిసిందే. గాయపడిన వారిలో చికిత్స పొందుతూ క్రీస్తుకుమారి(45) శుక్రవారం గుంటూరు సమగ్ర వైద్యశాలలో మృతి చెందగా, పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు శనివారం అప్పగించారు. మృతదేహాన్ని దుండిపాలెం నుంచి తెనాలి మండలం అంగలకుదురుకు తీసుకువచ్చిన కుటుంబసభ్యులు, బంధువులు తెనాలి–గుంటూరు వయా నారాకోడూరు రహదారిపై అంగలకుదురు సెంటరులో ధర్నా చేశారు. మృతదేహాన్ని రోడ్డుపై ఉంచి రాస్తారోకో చేశారు. సాయంత్రం 3.30 నుంచి 5.30 వరకు రెండు గంటల పాటు ఆందోళన చేశారు. ప్రమాదం కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. చుండూరు తహసీల్దార్ కనకదుర్గ వచ్చి ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

## క్షయ వ్యాధిపై ప్రయాణికులకు అవగాహన

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిపై అందరూ అవగాహన కలిగి ఉండాలని శ్యామ్ అండ్ జైన్ సంస్థ ఫౌండర్ వి.అలెగ్జాండర్, టీబీ యూనిట్ తెనాలి సూపర్‌వైజర్ రవికుమార్‌లు సూచించారు. ప్రపంచ టీబీ డేలో భాగంగా తెనాలి బస్టాండ్‌లో ప్రయాణీకులకు శనివారం టీబీపై అవగాహన కల్పించారు. టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటివి తెలియజేశారు. కార్యక్రమంలో న్యాయవాది ఎంఆర్‌ఎల్ వర్మ, ఆర్టీసీ ఉద్యోగులు ఇ.ప్రేమ్‌కుమార్, సోషల్ వర్కర్ ప్రవీణ్‌పాల్ పాల్గొన్నారు.



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న అలెగ్జాండర్

### 16న ఓంకార ఆశ్రమ స్థలం లీజుకు బహిరంగ వేలం

తెనాలిటౌన్: పట్టణ బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీ ఓంకార ఆశ్రమానికి సంబంధించిన ఖాళీ స్థలం లీజుకు బహిరంగ వేలాన్ని ఈ నెల 16న షరాఫ్‌బజార్‌లోని పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాస రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు సంవత్సరాల కాల పరిమితిలో స్థలాన్ని లీజుకు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. పంచముఖ ఆంజనేయస్వామి వారి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన షాపును మూడు సంవత్సరాల కాలములన్నింటికి లీజుకు సంబంధించి అదే రోజు ఉదయం 11గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రామలింగేశ్వరపేటలోని రామేశ్వర స్వామి దేవస్థానంకు సంబంధించి, వైకుంఠపురం పక్కన గల 0–49సెంట్లు ఖాళీ స్థలాన్ని లీజుకు మూడు సంవత్సరాల కాల పరిమితికి బహిరంగ వేలం, అదే రోజు మధ్యాహ్నం 12గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

### పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో శనివారం ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు మొక్కలు నాటారు. ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ మేనేజింగ్ డైరెక్టర్ జోగిపర్తి శైలజ సహకారంతో ఆల్ గ్రీన్ ఫీల్డ్స్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఫీల్డ్స్ ప్రతినిధి రత్నకుమారి తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రీతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో దోహదం చేస్తాయని, పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పెంచుటకు ఏర్పాటు చేస్తామని చెప్పారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ పీహెచ్‌సీ ఆవరణలో మొక్కలు నాటడానికి ముందుకు వచ్చిన సేవా సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### క్లారినెట్ కళాకారుడు శ్యామ్‌కు సత్కారం



తెనాలి: పట్టణంలో జరుగుతున్న ఎన్టీఆర్ శతజయంతి మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సభలో ఎన్టీఆర్ వ్యక్తిత్వం, ఆయన నటించిన సినిమాలు, రాజకీయ జీవితంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్లారినెట్ కళాకారుడు మేడిద శ్యామ్‌కుమార్ సత్కరించారు. వక్తలు అడపా వెంకట లక్ష్మీసంపత్‌రాయుడు, వేజెళ్ల ఉమామహేశ్వర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్ పాల్గొన్నారు.

### రేపట్నుంచి అష్టలక్ష్మీ అమ్మవార్ల రజతోత్సవాలు

తెనాలి: స్థానిక కొత్తపేటలోని అష్టలక్ష్మీ అమ్మవారి దేవాలయంలో అష్టలక్ష్మీ అమ్మవార్ల 25వ జయంతి రజతోత్సవాలు ఈనెల 6,7,8 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నారు. మలయాళ సద్గురు దేవుల దివ్యానుగ్రహంతో అష్టలక్ష్మి పీఠం సంస్థాపకులు దండి స్వాముల ఆధ్వర్యంలో నంబూరులోని కాశీ వనాశ్రమ పీఠాధిపతులు చంద్రకాళీప్రసాద మాతాజీ అధ్యక్షతన, కుమార్ పంప్స్ ఇండస్ట్రీస్ ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం నిర్వహణలో తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రం వేదికగా ఈ వేడుకలు జరుగుతాయని శనివారం తెలియజేశారు. 6వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి మహాశోభాయాత్రతో వేడుకలు ఆరంభమవుతాయి. 7న ఉదయం 4 గంటలకు అమ్మవారికి మహాభిషేకం, 10 గంటలకు శ్రీషోడశీ యతిపూజ, సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ఊంజల సేవ, ప్రవచనములు ఉంటాయి. 8న ఉదయం 6 గంటలకు మహాకుంభాభిషేకం, 10 గంటకు అమ్మవారికి సహస్ర నామార్చన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలిపారు. శ్రీషోడశీ యతిపూజలో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 16 మంది యతీశ్వరులు పాల్గొంటారని వివరించారు.

## వేసవిలోగా తొలి విడత ఇళ్ల నిర్మాణాలు

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ ఆదేశం

తెనాలి: పట్టణంలోని పేదలకు వివిధ లే అవుట్లలో ఇచ్చిన నివేశన స్థలాల్లో ఇళ్లనిర్మాణం త్వరితగిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్పష్టంచేశారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో శనివారం మున్సిపల్, గృహనిర్మాణ సంస్థ, పర్యవేక్షకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. లే అవుట్లలో తొలి విడతలో మంజూరైన గృహాలు, అవి ఏయే దశల్లో ఉన్నవనే అంశాలను తెలుసుకున్నారు. పెదరావూరు, జగ్గడిగుంటపాలెం, నేలపాడు, బుర్రిపాలెం లే అవుట్లలోని జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇళ్లనిర్మాణం వేగవంతం కావాల్సిందేనని చెప్పారు. ప్రస్తుతం వాతావరణం అనుకూలంగా ఉన్నందున వేసవి ముగిసేలోగా తొలి విడత ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్టు గుర్తుచేశారు. లక్ష్య సాధనకు ఏవైనా సమస్యలు అడ్డంకిగా ఉన్నాయా? అనే అంశాన్ని ప్రశ్నించి తెలుసుకున్నారు. ఏవైనా సమస్య లుంటే వెంటనే తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఆదివారం కూడా జగనన్న కాలనీల్లోని ఇళ్ల నిర్మాణంపై సమీక్ష చేస్తామని చెప్పారు. సోమవారం సంబంధిత లే అవుట్లను సందర్శించి పనులు వేగవంతమయేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, గృహనిర్మాణ సంస్థ ఈఈ భాస్కరరావు, డీఈఈ రఫీ, పర్యవేక్షకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్, పక్కన ఖలేదా నసీమ్, జస్వంతరావు

## ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొల్లిపర: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని నిత్యం ప్రజలకు నిర్మాణాలపై అవగాహన కల్పించాలని తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, అత్తోట, శివలూరు ఆయా గ్రామాలలో జగనన్న కాలనీలో లేఔట్లను పరిశీలించి ఇల్లు నిర్మాణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మాణాల ప్రగతి తక్కువగా ఉందని దీన్ని మెరుగుపరిచేందుకు లబ్ధిదారులతో మాట్లాడి వేగవంతం చేయాలని సూచించారు. అలాగే ఆయా జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయి గృహప్రవేశాలు జరిగేటట్టుగా కృషి చేయాలన్నారు. ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాల పురోగతి పూర్తిస్థాయిలో సాధించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ పి.శ్రీనివాసులు, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయం సిబ్బంది లబ్ధిదారులు పాల్గొన్నారు



జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ

## సీఎం జగన్ చిత్రపటానికి ముస్లిం పెద్దల క్షీరాభిషేకం

తెనాలి: పట్టణంలో ముస్లింల కోసం ప్రత్యేకంగా షాదీఖానా నిర్మాణానికి కృషిచేసి, అడిగిన వెంటనే రూ.4 కోట్లను కేటాయించినట్టు ప్రకటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం జగన్ చిత్రపటానికి ముస్లింలు క్షీరాభిషేకం చేశారు. స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆవరణలో శనివారం ముస్లిం పెద్దలు, ముతవల్లీలు పాల్గొన్న సమావేశంలో షాదీఖానా ఆవశ్యకతను గుర్తించిన ఎమ్మెల్యే శివకుమార్, రైతుభరోసా సాయం పంపిణీకి తెనాలి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి విన్నవించటం, ఆయన పెద్దమనసుతో రూ.4 కోట్ల నిధులను కేటాయించటంపై వారంతా హర్షం వ్యక్తంచేశారు. డాక్టర్ రియాజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లింలపై వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న ఆదరణ గొప్పగా ఉందన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ మాట్లాడుతూ ముస్లిం మహిళను తొలిసారిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పదవిని ఎమ్మెల్యే శివకుమార్, ప్రస్తుతం ముస్లిం సోదరులకు ఎప్పట్నుంచో కలగానే మిగిలిపోయిన షాదీఖానా సాకారానికి తోడ్పడినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే శివకుమార్‌లు ఉన్న ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ముస్లిం పెద్దలు గోల్డ్ రహిమా, జేబీ జిలాని, ముఫ్తీ అల్లావుద్దీన్, షేక్ షబ్బీర్, ముఫ్తీ రియాజ్, ముఫ్తీ హైదర్‌అలీ, సయ్యద్ గౌస్, పెచ్చింగ్ సుభాని, షేక్ మీరావలి, పెదరావూరు ఫరీద్, మారుల్లా, రెడీమేడ్ సలీమ్ పాల్గొన్నారు.

## వైద్య సేవలపై అవగాహన అవసరం

డీసీహెచ్ఎస్ డాక్టర్ హనుమంతరావు

తెనాలిఅర్బన్: వైద్యసేవలపై మరింత అవగాహన పెంచుకోవాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ జె.హనుమంతరావు సూచించారు. డిస్ట్రిక్ రెసిడెన్సి ప్రోగ్రామ్‌లో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలకు వచ్చిన 38మంది పీజీ స్టూడెంట్స్‌తో శనివారం వైద్యశాలలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ వైద్యుల నుంచి మెలకువలను తెలుసుకోవాలని సూచించారు. అలాగే అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు పాటిస్తూ మంచి పేరు తెచ్చుకోవాలన్నిరు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ గుంటూరు మెడికల్ కళాశాల, ఎన్ఆర్ఐ, కాటూరి మెడికల్ కళాశాలల నుంచి 38మంది పీజీ స్టూడెంట్స్ తెనాలి వచ్చినట్లు తెలిపారు. మూడు నెలల పాటు ఇక్కడే ఉండి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. సమావేశంలో ఆర్ఎంఓ డాక్టర్ సుధీర్, ఏఓ మజీద బేగం, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ హనుమంతరావు

## హైదరాబాద్‌లో 'బాబూజీ' ప్రదర్శన

తెనాలి: ప్రముఖ రాజకీయనేత, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితచరిత్రపై పట్టణానికి చెందిన సినీదర్శకుడు దిలీప్‌రాజా చిత్రీకరిస్తున్న బయోపిక్ 'బాబూజీ' సినిమాలోని కొన్ని సన్నివేశాలను శనివారం ఉన్నతస్థాయి సమావేశంలో ప్రదర్శించారు. భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న వందమంది ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ అధికారులు హైదరాబాద్‌లోని రాడిసన్ బ్లూ హోటల్‌లో జరిగిన 'గ్లోబల్ ఇన్ ఫామ్ మేక' వార్షిక సమావేశంలో పాల్గొన్నారు. కర్ణాటక మాజీ చీఫ్ సెక్రటరీ కె.రత్నప్రభ అధ్యక్షత వహించిన సమావేశంలో బాబూజీ సినిమాకు సంబంధించిన సన్నివేశాలను ప్రత్యేకంగా పవర్ పాయింట్ ప్రజెంటేషనులో ప్రదర్శించినట్టు దిలీప్‌రాజా తెలియజేశారు. జగ్జీవన్ రామ్ పాత్ర పోషిస్తున్న మిలటరీ ప్రసాద్, సినిమాకు పనిచేస్తున్న సాంకేతిక నిపుణులు హాజరయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు మిలటరీ ప్రసాద్‌ను అభినందించినట్టు వివరించారు.



సమావేశంలో దిలీప్‌రాజా పవర్ పాయింట్ ప్రజెంటేషన్

## హకీంజానీకి సరసభారతి ఉగాది పురస్కారం

తెనాలి: కృష్ణాజిల్లా ఉయ్యూరుకు చెందిన సాహిత్య, సాంస్కృతిక సంస్థ సరస భారతి వార్షిక ఉగాది పురస్కారానికి తెనాలికి చెందిన బాలసాహితీవేత్త, ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షేక్ అబ్దుల్ హకీంజాని ఎంపికయ్యారు. సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ నుంచి ఈమేరకు ఆహ్వానం అందింది. గత మూడు దశాబ్దాలుగా హకీంజాని సాహితీ సేవలకు గుర్తింపుగా ఈ గౌరవాన్ని ప్రకటించినట్టు తెలియజేశారు. ఈనెల 19వ తేదీ సాయంత్రం సరస భారతి ఆధ్వర్యంలో జరగనున్న శోభకృత్ ఉగాది వేడుకల్లో ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తారు. హకీంజాని బాలసాహిత్యంలో 36 పుస్తకాలు, 270 కథలు, 30 వయోచన వాచకాలతో కలుపుకొని 71 పుస్తకాలను రచించారు. మహారాష్ట్రలో 11, 12 తరగతుల పాఠ్యపుస్తకాల్లో హకీంజాని కథలను చేర్చారు. వీరి కృషికి గాను పలు అవార్డులు లభించాయి.



షేక్ అబ్దుల్ హకీంజాని